క్లుప్తంగా

నిరంతర విద్యుత్ సరఫరాకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట టౌన్ 2 పరిధిలో నిరంతర విద్యుత్ సరఫరాకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ టౌన్ 2 ఏఈ యశ్వంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే 94910 65886ను సంప్రదించాలని కోరారు.

శివాలయాలను సందర్శించిన కలెక్టర్ దంపతులు



కలెక్టర్ వెంకట్రావుకు జ్ఞాపిక అందజేస్తున్న పిల్లలమర్రి శివాలయాల కమిటీ సభ్యులు

సూర్యాపేట రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రిలో గల శివాలయాలను కలెక్టర్ ఎస్.వెంకట్రావు దంపతులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివాలయాల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్, శివాలయ కమిటీ చైర్మన్ కొట్ల సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రిక అందజేత



ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ ఈఓ కుశలయ్య

మద్దిరాల : మండల కేంద్రంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి 11వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఆలయ ఈఓ కళాశిక కుశలయ్య తిరుమలగిరిలో ఆహ్వానపత్రిక అందజేశారు. ఆయన వెంట అర్చకులు రాజోల్ శివప్రసాద్ శర్మ, తదితరులు ఉన్నారు.

రమేష్‌కు డాక్టరేట్



రమేష్

నాగారం : మండలంలోని నాగారంబంగ్లా గ్రామానికి చెందిన బాషబోయిన రమేష్ డాక్టరేట్ పొందాడు. ఆయన హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జంతుశాస్త్రం విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేయడంతో యూనివర్సిటీ వారు గురువారం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ మల్సూర్‌నాయక్‌ను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఆత్మకూరు (ఎస్) : మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న మల్సూర్ నాయక్ బదిలీపై వెళ్తుండడంతో గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది ఆయనను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.


లింగయ్య ఆశయ సాధనకు కృషిచేయాలి



సభలో మాట్లాడుతున్న యాదగిరిరావు

నూతనకల్ : సీపీఎం నాయకుడు దూదిగాం లింగయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని వెంకెపల్లిలో లింగయ్య సంతాప సభకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మట్టిపల్లి సైదులు, బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, దూదిగాం చిన ఎల్లయ్య, బత్తుల జనార్దన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నూతనకల్ : మండల కేంద్రంలోని శ్రీ పార్వతీసమేత శంభులింగేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లత



చివ్వెంల(సూర్యాపేట) : మహిళా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థుల తల్లులు

చివ్వెంల(సూర్యాపేట) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ లత అన్నారు. మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామశివారులో గల స్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు విద్యతో పాటు, క్రీడలు, వ్యాపార, వాణిజ్య రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ప్రతి రంగంలో తమ నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలో తెలంగాణ గృహ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కోఆర్డినేటర్ కాసా అనసూయ మాట్లాడారు. మహిళ లేనిది సృష్టి లేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పాల్వాయి సుహాసిని, ఉపాధ్యక్షురాలు అక్కినపల్లి పద్మ, జిల్లా కార్యదర్శి నిర్మల, చంద్రమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. అనంతరం మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణసందీప్, ఎంపీఓ నరేష్, ఏపీఎం అజయ్, సీసీ చెన్నయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి నాగమణి, ఉపేంద్ర, స్వరూప, పద్మ, జయమ్మ, మమత, ప్రమీల, నిర్మల, సరోజ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మహిళా కార్మికులకు సన్మానం

తిరుమలగిరి (తుంగతుర్తి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య మహిళా కార్మికులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు దాసోజు రాజేశ్వరి కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉపేంద్ర, మంగతాయమ్మ, అన్నపూర్ణ, నీరజ, నజీమాబేగం, శాంతిప్రియ, వీరన్న, వెంకన్న, రాజు పాల్గొన్నారు.

నాగారం : మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ కూరం మణిని గురువారం ఎంపీడీఓజి.శోభారాణి, వీబీకేలు, మహిళ సమైక్య సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చందన, ఏపీఎం శోభారాణి, వీబీకేలు, మహిళ సమైక్య సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అర్వపల్లి : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మన్నె రేణుక, వైస్‌ఎంపీపీ మారిపెద్ది భవానీతో పాటు వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్, ఏపీఎం మల్లేష్, జూనియర్ అసిస్టెంట్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.



చివ్వెంల(సూర్యాపేట) : అదనపు కలెక్టర్ లతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు

తిమ్మాపురం పాఠశాలలో..

తిమ్మాపురంలోని ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులు ఎస్.విజిత, వి.అనితలను హెచ్‌ఎం వి.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, వి.సైదులు, నాగరాజు, ఎస్.శేఖర్ సన్మానించారు.



తిరుమలగిరి (తుంగతుర్తి) : మహిళా పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహిళలను సన్మానిస్తున్న అధికారులు



నాగారంలో ఎంపీపీ కూరం మణిని సన్మానిస్తున్న అధికారులు, మహిళలు

యూనిఫైడ్ కౌన్సిల్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : జాతీయ స్థాయిలో యూనిఫైడ్ కౌన్సిల్ వారు నిర్వహించిన నేషనల్ లెవల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో పట్టణంలోని జయ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి బి.రామ్‌సాయి స్టేట్ 3వర్యాంకు, 7వతరగతి నుంచి బి.కార్తికేయ ఆల్ ఇండియా 15వ ర్యాంకు, వి.జయసూర్య 27వర్యాంకు, బి.సాయిచరణ్ 35, వై.వీక్షణ 57వ ర్యాంకు, 6వ తరగతి నుంచి ఆల్ ఇండియాలో ఇ.సాయిదీక్షిత 55, పి.షణ్ముక ప్రత్యయ్ 84, కె.కార్తికేయ శ్రీవాత్సవ్ 87వ ర్యాంకు, ఆర్.రమ్యానంద్ 91వ ర్యాంకు, 9వ తరగతి నుంచి జి.కావ్య 3వ ర్యాంకు, ఎస్‌కె.రెహాన్ 17, ఆర్.సుహాస్ 20వ ర్యాంకు, పదోతరగతి నుంచి జి.శ్రీనిక 29వ ర్యాంకు, ఆర్.సుజిత్ 29వ ర్యాంకు, జి.పవన్ 38వ ర్యాంకు జాతీయ స్థాయిలో సాధించగా, స్టేట్ 2వ ర్యాంకు ఎస్‌కె.నేహసాయి, పి.అనిరుధ్ 4వ ర్యాంకు, శివరక్షిత 9వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు జిల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

ఉన్నతమైన భావాలకు ప్రతిరూపం వ్యక్తిత్వం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ నగేష్, ట్రైనర్ రవి

సూర్యాపేటటౌన్ : ఉన్నతమైన భావాలకు ప్రతిరూపం వ్యక్తిత్వమని మహర్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పల్లె నగేష్ అన్నారు. గురువారం పట్టణంలోని మహర్షి డిగ్రీ కళాశాలలో ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ డాక్టర్ పిన్నం రవి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతుల్లో భాగంగా 11 రోజుల పాటు నిర్వహించిన ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ కోర్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిజమైన వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. జీవితం నేర్పే అనుభవాలతో పాటు పెద్దలు చెప్పే జీవిత పాఠాలను, మహనీయుల జీవిత చరిత్రలను ఆకళింపు చేసుకొని సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రవీణ్‌రెడ్డి, రమాదేవి, రాజశేఖర్, శ్రీను, లింగయ్య, వెంకటేష్, సౌమ్య, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలని ఆందోళన

చివ్వెంల(సూర్యాపేట) : మండలంలోని ఉండ్రుగొండ గ్రామంలో డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలకు వెళ్లే దారిలో ఉపాధిహామీ నిధులతో డ్రెయినేజీ పూర్తిస్థాయిలో నిర్మించకుండా కాంట్రాక్టర్ వదిలేశాడని, దీంతో మురుగునీరు వీధుల్లో నిలిచి దుర్వాసన వెదజల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చౌడమ్మ, మౌనిక, లింగమ్మ, నాగమ్మ, మంగతాయమ్మ, జయమ్మ, ఈశ్వరమ్మ, ఇంద్రమ్మ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పదోతరగతి ప్రశ్నపత్రాలు

తుంగతుర్తి : ఈనెల 18నుంచి జరుగనున్న పదోతరగతి వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాలు గురువారం మండల పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. మండల కేంద్రంలోని తుంగతుర్తి జెడ్పీహెచ్‌ఎస్ బాలుర, మేరిమథర్, గిరిజన గురుకుల పాఠశాల, తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు, సెట్–1 ప్రశ్న పత్రాలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచినట్లు ఎంఈఓ బోయిని లింగయ్య తెలిపారు.

బాండ్ల వివరాలను వెల్లడించాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న సర్వోత్తమ్‌రెడ్డి, నాయకులు

భానుపురి (సూర్యాపేట) : కార్పొరేట్ కంపెనీలు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల్లో గోప్యతను పాటించే ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎస్‌బీఐ వెంటనే వెల్లడించాలని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్టోరల్ బాండ్లకు ప్రాథమిక లబ్ధిదారుగా ఉన్న ఎస్‌బీఐ కార్పొరేట్ సంస్థల విరాళాలను ప్రజలకు చెప్పాలని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో కేసు వేశారని అన్నారు. మార్చి 6వరకు వివరాలు తెలపాలని ఎస్‌బీఐని సుప్రీంకోర్టు ఆదేశించగా వివరాలు తెలుపకపోగా మళ్లీ గడువు కోరడం సరైందికాదన్నారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వేల కోట్ల విరాళాలు వచ్చాయని, దీనిపై కాంగ్రెస్ మొదటి నుంచి పోరాడుతుందన్నారు. సామాన్యుడి అకౌంట్లలో రెండు లక్షలు జమ అయితే ఐటీ నోటీసులు ఇచ్చే ఎస్‌బీఐ వేలకోట్ల అకౌంట్ల వివరాలను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, నాయకులు పోలగాని బాలు, చింతమళ్ల రమేష్, రెబల్ శ్రీను, మాణిక్యం, శేఖర్, వెంకన్న, దిలీప్‌రెడ్డి, అభినయ్, శ్రీనివాస్, కరుణాకర్, గండూరి రమేష్, శబరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన వరిపంట పొలాల పరిశీలన



ఆత్మకూరు (ఎస్) : నెమ్మికల్‌లో ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు (ఎస్) : వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి పంట పొలాలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని నెమ్మికల్‌లో ఎండిపోయిన పంట పొలాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. సకాలంలో ఎస్సారెస్పీ నీరు రాకపోవడం వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లు ఎండిపోయి సాగుచేసిన పంటలు దెబ్బతింటున్నాయని అన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకట్‌రెడ్డి, నాయకులు దండా శ్రీనివాస్‌రెడ్డి, రవి, వెంకన్న, ఎల్లయ్య, విజయరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేయాలని వినతి

పెన్‌పహాడ్ : మండలంలో ఎండుతున్న పంటలకు సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి రూ.30వేలు ఇవ్వాలని, గ్రామాలను యూనిట్‌గా తీసుకొని కరువు గ్రామాలుగా ప్రకటించాలన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చినపంగ నర్సయ్య, వీరబోయిన రవి, ధనియాకుల శ్రీకాంత్, బొమ్మిరెడ్డి గోపిరెడ్డి, కొండమీది రాములు, నెమ్మాది లక్ష్మి, వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలోని చివ్వెంల మండలం కుడకుడ గ్రామశివారు సర్వే నంబర్ 126లోని ప్రభుత్వ భూమిలో రెడ్డికమ్యూనిటీ హాలుకు కేటాయించిన స్థలాన్ని రద్దుచేసి అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని పీఓడబ్ల్యూ కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమిలో రెడ్డి కమ్యూనిటీహాల్‌కు కేటాయించిన స్థలాన్ని గురువారం పరిశీలించి అక్కడ ఆందోళన చేశారు. ప్రభుత్వం వెంటనే కల్పించుకొని రెడ్డి కమ్యూనిటీ హాల్ రద్దుచేసి తిరిగి పేదల స్థలాన్ని పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలన్నారు. అదే విధంగా ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా నాయకులు గొడ్డలి నరసన్న, లక్ష్మన్న, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రేణుక, కోశాధికారి జయమ్మ, కుడకుడ గ్రామ కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు



బీసీ ఫెడరేషన్ కులాల సమితి నాయకులను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు దుర్గారావు తెలిపారు. గురువారం మున్సిపాలిటీలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎల్సోజు నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ఫెడరేషన్ కుల సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. గత ప్రభుత్వంలో బీసీ ఫెడరేషన్ కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని, బీసీ ఫెడరేషన్ కులాలకు తగిన న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎల్సోజు నవీన్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి ఉపేందర్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగేందర్, కోశాధికారి కరుణాకర్, శ్రీనివాస్, చారి, ప్రభాకర్, సోమయ్య, ఉపేంద్ర, రమేష్, నరేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు



భానుపురి (సూర్యాపేట) : విద్యుత్ దీపాలంకరణలో విశ్వనాథస్వామి ఆలయం



నాగులపహాడ్‌లోని శ్రీత్రికుటేశ్వర దేవాలయం

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయంతో పాటు మండల పరిధిలోని నాగులపహాడ్‌లో గల త్రికుటేశ్వర ఆలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. అందుకు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నాగులపహాడ్‌లో ఈనెల 8నుంచి 11వ తేదీ వరకు శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ సంకరమద్ది సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8న తెల్లవారుజామున గణపతి హోమం, మృత్యుంజయ హోమం, అభిషేకం, అలంకరణ దర్శనం, సాయంత్రం శివనామ స్వరాలతో భజనలు, రాత్రి శివపార్వతుల కల్యాణం, 9న అభిషేకాలు, అర్చనలు, అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, 10న అర్చనలు, అభిషేకాలు, క్రీడోత్సవాల ముగింపు, బహుమతుల ప్రదానం, 11న శివపార్వతుల ఉత్సవమూర్తుల ఊరేగింపుతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లాల స్థాయి కబడ్డీ, కోలాటం, వాలీబాల్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆవునగల్లు కేంద్రంగా కాకతీయుల సామంతులు కాట్రిరెడ్డి నామిరెడ్డి క్రీ.పూ.1256వ సంవత్సరంలో మండల పరిధిలోని నారాయణగూడెంలో నాగులపహాడ్ త్రికుటేశ్వరాలయం నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ ఆలయంలో గంగా, యమున, సరస్వతీ, నంది విగ్రహాలతో పాటు మూడు వైపులా శివుడి విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఆరాధించబడుతుంది.

మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

అర్వపల్లి : మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. జాజిరెడ్డిగూడెంలోని మూసీ నది ఒడ్డున ఉన్న పార్వతీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్ర, శనివారం వేడుకలను నిర్వహించనున్నారు. కాగా ఇక్కడ కల్యాణ వేడుకకు మండపాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. అర్వపల్లి శివారులోని చిన్నగుట్టపై ఉన్న ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి కల్యాణోత్సవం, శనివారం అన్నపూజ కార్యక్రమాలు జరుగనున్నాయి. అలాగే తిమ్మాపురంలోని అఖండజ్యోతిస్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రం, కొమ్మాలలోని శివాలయంలో కూడా శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పర్సాయపల్లిలోని గుట్టపై ఉన్న జంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు చేపట్టారు.

విశ్వనాథస్వామి ఆలయం ముస్తాబు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని అన్నపూర్ణ సహిత విశ్వనాథస్వామి దేవాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యింది. నేడు ఉదయం 4:30నిమిషాలకు రుద్రాభిషేకంతో శివరాత్రి వేడుకలు ప్రారంభంకానున్నట్లు ఆలయ అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ తెలిపారు. 9న ఉదయం నుంచి రుద్రాభిషేకం, రాత్రి 8నుంచి 10:30 గంటల మధ్య స్వామివారి కల్యాణం, 10న పూర్ణాహుతి, అన్నదానం, సాయంత్రం నంది వాహనంపై శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కల్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలతో హాజరుకానున్నట్లు తెలిపారు.

పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంగ

నూతనకల్ : పితృస్వామ్య భావజాలాన్ని బలోపేతం చేయడానికి మోదీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు, మేధావులు పోరాడాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళ హక్కులను కాలరాసే పితృస్వామ్య భావజాలాన్ని పెంపొందించడం సరైంది కాదన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్, కంచర్ల నర్సమ్మ, పులుసు సుజాత, పెద్దింటి రంగారెడ్డి, గంటా నాగయ్య, బొడ్డు శంకర్, దేసోజు మధు, శ్రీనివాస్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

మద్దిరాల : మండల పరిధిలోని చిన్ననెమిలా గ్రామానికి చెందిన రైతు పాముకాటుకు గురై మృతిచెందాడు. గ్రామస్తులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్ననెమిలా గ్రామానికి చెందిన రావుల లింగయ్య(58) బుధవారం రాత్రి 11గంటల సమయంలో తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా పాముకాటు వేసింది. లింగయ్య వెంటనే ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మద్దిరాల : మండలంలోని గోరెంట్ల గ్రామంలో ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. గృహజ్యోతి పథకం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపా రు. సీసీరోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, వర్కింగ్ ప్రసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి కంర్తం, కూజ ఎల్లేష్, ఉబ్బని రఘుపతి, బత్తుల వెంకటేశ్వర్లు, సంగని విద్యాసాగర్, సందీప్, శ్రీనివాస్, రమేష్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి ద్వాదశ ప్రదక్షిణలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాజ వాహనంపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవి విగ్రహాలను అదిష్ఠింపజేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, స్వామి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

– సాక్షినెట్‌వర్క్



పెన్‌పహాడ్ : చీదెళ్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



చివ్వెంల(సూర్యాపేట) : ఉండ్రుగొండ పాఠశాలలో..



నాగారం : ప్రాథమిక పాఠశాలలో..



ఆత్మకూరు (ఎస్) : కొత్తతండా పాఠశాలలో..



నూతనకల్ : యడవెళ్లిలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు